# కళ్లు

**కథానిక**

మహీధర రామశాస్త్రి

నా పేరు వేణు. నేను చూడ లేను. పుడుతూనే కళ్లు లేకుండా పుట్టాను. నాకు పాకుతోనే, మా యింట్లో మిట్ట పల్లాలు, గోడలు, గడపలు తెలిసి పోయాయి. మాట ధ్వనిని బట్టి అమ్మ, నాన్న, తమ్ముళ్లు, చెల్లాయిలు పరిచయం అయారు. పెద్దయాక, వీధుల్లో నడవడం నా కాళ్లకి అలవాటయింది. ఊరంతా నాకు పరిచయమే!

నాకు పేరు పెట్టలేదు. ఇంటా బయటా అందరు "అబ్బీ! సుబ్బీ!" అని పిలుస్తూండే వారు. నన్ను వేణు అని పిలవడం చాలా విచిత్రం జరిగింది.

నాకు పదేళ్లు. ఓ సాయంకాలం నాకు వేణుగానం వినిపించింది. ఆ గానానికి నా శరీరం పులకరించింది. ఎప్పుడూ పొందని ఆనందం పొందాను. నాకు తెలియకుండానే, నా కాళ్లు నడిచాయి. క్రమేపీ ఆ గానం దగ్గరయింది. బాగా దగ్గరయాక, అక్కడ నిలబడిపోయాను. అయిదు నిముషాలయాక, వేణు గానం ఆగింది.

"బాగుందిరా, గుడ్డి సుబ్బీ?" అని ప్రశ్నించారు.

అది మా అవధానులు గారి గొంతు. తల ఊపాను. దగ్గరగ రమ్మన్నారు. వెళ్లి కూర్చున్నాను. తిరిగి వేణు గానం సాగింది. ఆ లయకు నా శరీరం ఊగింది. అవధానులు గారు లయ మార్చారు. నా శరీరంలో కదలిక మారింది.

అది కేవలం కన్నాలున్న కర్ర గొట్టం మాత్రమేనని తెలుసుకున్నాను. దాన్ని పెదవి కాన్చి, గాలి పోస్తూ ఊదాలని అవధానులు గారే చెప్పారు.

"నన్ను ఊదనివ్వరా ?" అని అడిగాను.

నా గొంతులో ఏ అభ్యర్ధన వారిని కదిలించిందో తెలియదు. నాకు మరో వేణువు నిచ్చారు. ఎలా ఊదాలో చెప్పారు. ఆయన వినిపించిన స్వరం తిరిగి మ్రోగించడం మొదలు పెట్టాను.

"పట్టు దొరుకుతూందిరా నీకు !" అన్నారు అవధానులు గారు. అలా ఆరంభమయింది నా వేణుగానం. ఇంటి దగ్గర వాయిస్తూ వుండే వాడిని. అప్పటి నుంచి నన్ను "వేణు" అని పిలవడం మొదలు పెట్టారు.

నిద్ర లేచింది లగాయితు, నేను చేసే పనులు పరిమితంగా వుంటాయి. నూతి పళ్ళెం దగ్గర నాకు ఓ పీట, డేగిసాతో నీళ్లు సిద్ధంగా వుంటాయి. పక్కనే సబ్బు వుంటుంది. స్నానం చేసి యివతలకు రావడం, గుడ్డలు మార్చుకోవడం నేర్పారు. రెండు పూటలా తిండి, సంగీత సాధన, నిద్ర; ఇదే నా దిన చర్య.

క్రమంగ నాకు కీర్తనలు, రాగ తాళయుక్తంగ వాయించడం వచ్చింది. ఇంటి వద్ద అదే పనిగా వాయిస్తూ సాధన చేసే వాడిని. నేర్పిన ప్రతి కీర్తన మరు నాటికల్లా ఎంతో చక్కగా వాయిస్తూన్నట్టు అవధానులు గారు చెప్పేవారు. అవధానులు గారు ఏది వాయిస్తే, నేనూ

ఆయనతో కలిసి సమంగ వాయించడం మొదలు పెట్టాను, ఓ సారి మా వూరు ఓ వైలనిస్టు వచ్చారు. ఆయన నా వేణు గానం విన్నారు. నన్ను రేడియోలో ప్రయత్నించ మన్నారు.

మా యింట్లో వాళ్లకి నా మీద శ్రద్ధ పుట్టింది. సాధన సాగుతూనే వుంది. మావాళ్ల సంప్రదింపులు ఫలించాయి. నన్ను రేడియో స్టేషనుకి తీసుకు వెళ్ళారు. మా వూరు నించి పొరుగూరు వెళ్ళడం నాకిది మొదటిసారి. నాతో కూడా నాన్న ఉండే వారు. బండి బస్సు, రైలు అనుభవాలు విచిత్రంగ జరిగాయి. చూడలేక పోతున్నందుకు విచారం కలిగింది. ఈ విచారం మొదటి సారి నా చిన్నతనంలో కలిగింది.

ఓ సారి, మా తమ్ముడు ఓ బొచ్చు కుక్క పిల్లని తెచ్చాడు. అంతా దాని చుట్టూ మూగి, సంతోషంతో గెంతుతూ దాన్ని పొగుడుతున్నారు. "ఎంత బాగుందో! ఎంత మెత్తగా వుందో! ఏలా చూస్తుందో! ఆ తెల్లని వొంటి మీద నల్లని మచ్చలు బాగున్నాయి కదమ్మా?"

ఇలా సాగింది, వాళ్ళ సంబరం. ఆ బాగు నాకు తెలియదు కదా? అది ఎలా చూస్తూందో నాకు తెలియదు. నా కన్నా అది అదృష్టవంతురాలు. అందరినీ చూడగలుగుతూంది. తెలుపు, నలుపు తారతమ్యం తెలియని నాకు, దాని అందం ఎలా తెలుస్తుంది?

"ఒరే! నన్ను చూడనివ్వండ్రా!" అన్నాను.

"ఏం చూస్తావు నువ్వు?" అనే వారు అంతా.

నాన్న దాన్ని నా చేతుల కందిం చారు. పట్టు శాలువా అంచుల కుచ్చుల్లా మెత్తగా తగిలింది దాని వొళ్లు. దాని తోక, కాళ్ళు, మూతి ఎలా ఉన్నాయో, ఎక్కడ తెల్లగా ఉందో, ఎక్కడ నల్లగా ఉందో, వివరించి చెప్పారు నాన్న. శరీరం అంత ఒకలాగా, కాళ్ళు, చెవులు మూతి మరొకలా ఉన్నాయని అర్థం అయింది. ఇలా చూడలేని విషయాలు చూసినట్లు నాన్న నాకు చెబుతూ వుండేవారు.

★ ★ ★

రేడియో స్టేషనుకి మా గదికి తేడా ఏమీ తెలియలేదు. మామూలుగ, అవధానులు గారి ముందు వాయించి నట్టే వాయించాను. మెచ్చుకున్నారు; రికార్డింగ్ జరిగింది.

నాకు రేడియోలో మురళీ గానం చేసే అవకాశం వచ్చిందని తెలిసి అవధా నులు గారు చాలా సంతోషించారు.

రేడియోలో నాకు పేరు వచ్చింది. ఎందరో సంగీత విద్వాంసుల పరిచయం లభించింది. ఎన్నో మెళు కువలు తెలుసుకుని నా గానానికి మెరుగులు దిద్దుకున్నాను. క్రమేపీ నా స్థితి మారింది. నా కొక ఉపాధి దొరికింది. మా వాళ్ల మనస్తాపం తగ్గింది.

మనిషి మనసు విచిత్రమైంది. ఓ కోరిక తీరాక, మరో కోరిక మొల కెత్తుతుంది. ఇది చచ్చేవరకు సాగు తుంది. నా భవిష్యత్తును గురించి ఆందో ళన తగ్గాక, సంగీతం నా జీవనోపాధి అయాక, మరో కోరిక బయలు దేరింది మా వాళ్లకి.

నాకు పెళ్లి చేయాలని! కట్నం

వద్దన్నారు. పెళ్ళి ఖర్చులు భరిస్తామన్నారు. కాని, కట్నం తీసుకోని వాడినే పెళ్ళాడతానని శపథం పట్టిన ఏ అమ్మాయి కూడా నన్ను పెళ్ళాడ్డానికి సాహసించ లేదు.

“కట్నం తీసుకోని ఆదర్శవంతుడికే యిస్తాను నా కూతురిని!” అన్న ఏ ఆడపిల్ల తండ్రి నన్ను అల్లుడిగ పొందదలచ లేదు!

గుడ్డివాడి ఆదర్శం గుడ్డిదే అవుతుంది!

కాని – “అవదు” అనుకున్న నా పెళ్ళి అయింది.

ఓ సుశీల పినతండ్రి, ఓ రోజు మా యింటికి వచ్చి –

“మా అన్నగారమ్మాయి, సుశీలని చేసుకోమని అడుగుదామని వచ్చాను. మా వదిన గారు, ప్రమాదవశాత్తు వంటింట్లో చీర అంటుకుని పోయింది. ఆ బెంగతో, మా అన్నగారు గుండె ఆగి నెల తిరక్కుండా పోయారు. సుశీల భారం నా మీద పడింది. దీనికి పెళ్ళి యీడు వచ్చింది. మీ వాడి గుణగణాలు విని ముగ్ధుడ నయ్యాను. మీ వాడికిచ్చి చేసేస్తే, పిల్ల సుఖపడుతుంది. మరి . . . .”

“పిల్లకి యిష్టమేనా?” మా అమ్మ ప్రశ్న.

“ఏమండోయ్! ఇష్టమా అని అడుగుతున్నారా? మీ వాడి వేణుగానం రేడియోలో విని మక్కువ పెంచుకుంది. ఇంక దృష్టా? వాళ్ళే సర్దుకుపోతారు. ఏమంటారు?”

అనడానికేముంది? అనుకున్నారో. నాటికి, అతి సామాన్యంగా వివాహం జరిగి పోయింది.

“సుశీల మంచిది!” అన్నారు మా యింట్లో అంతా. మంచిది కాకపోతే, అంధుణ్ణి నన్ను ఎందుకు కట్టుకుంటుంది, కాపురం చేస్తుంది? నా అంధత్వం మా దాంపత్య జీవితానికి అడ్డు రాలేదు. గతంలో పోగొట్టుకున్నది ఏదో పొందినట్లు అనిపించింది. సుశీల కళ్ళే నా కళ్లు!

రేడియోలో వాయించడం వచ్చాక, హైదరాబాదు మకాం మార్చేశాము. నాకు సంగీత పాఠాలు కూడ దొరుకుతున్నాయి. కళ్లు లేక చాలా పాఠాలు విదులు కోవలసి వస్తూంది. కళ్లు వస్తే మా ఆదాయం రెండితలు అయే అవకాశాలున్నాయి.

సుశీల కోరిక నాకు కళ్లు రావాలని సుశీల ఎందరో కంటి వైద్యులను సంప్రదించింది. డా॥ చక్రవర్తి నన్ను పరీక్షించి, “అపరేషను చేసి, కంటి గ్రుడ్లు మారిస్తే, చూపు రావడానికి అవకాశం ఉంది!” అన్నారు. ఐ బ్యాంకులో కళ్ళు సరియైనవి దొరికినప్పుడు, అపరేషన్ చేద్దామని చెప్పారు. ఎవరయిన కళ్లు దానం యిస్తే మరింత చవగ్గ, చురుగ్గ జరుగుతుందని డాక్టర్ చక్రవర్తి చెప్పారు.

సుశీల ప్రయత్నాలు ఫలించాయి. మూత్రపిండాలు పాడయి, ఓ యువకుడు హాస్పిటల్లో చేరాడు. అతను బ్రకతడం దుర్లభం అని తేలిపోయాక, సుశీల ఆ యువకుని సంప్రదించింది. ఆ యువకుడు సుశీల ప్రార్థన ఆలకించాడు. తను జీవించేది ఎలాగూ లేదు. కనీసం తన కళ్లు మరో జీవికి మార్గం చూపితే దానం చేయడం ఉత్తమ మార్గంగ తోచింది.

ఆపరేషను జరిగింది. ఓ రోజు చీకటి గదిలో కట్లు విప్పి నాకు చూపు రప్పించారు. నెమ్మదిగ కళ్లు తెరిచాను. నీడల్లా మనుషులు కనిపించారు. నెమ్మదిగ లైట్లు వెలిగాయి గదిలో. డాక్టరుని చూడగలిగాను. ఎంత ఆనందం! ఇన్ని రోజుల అంధకారాన్ని పారద్రోలి దివ్యకాంతులు జీవితం నిండ పండించుకోవాలి. నాలో ఎంత ఆరాటం!

సుశీల అందాన్ని చూడ గలిగాను. కళ్లు లేనప్పుడు సుశీల మానసిక సౌందర్యాన్ని చవి చూచాను. కళ్లు వచ్చాక సుశీల శారీరక అసౌందర్యాన్ని చూసాను.

సుశీల కురూపి!నలుపు. శరీరం రోమమయం. స్త్రీ సహజమైన ఆకర్షణ ఆమె రూపానికి లేదు. "సుశీల మంచిది!" అని మావాళ్ళు అన్నప్పుడు, ఆ మంచితనం మరోలా కనిపించింది. సుశీల పట్ల నా మనస్సు ఆకర్షింపబడదు!

చూపు రాకపోయి వుంటే ఎంత బాగుండును!

ఈ కళ్ళతో చూస్తూ, నేను అంధుడనైనప్పుడు నా జీవనజ్యోతిగా నిలచి, ఆ అంధుణ్ణి ప్రేమించిన ఈ ఉదార మూర్తి మానసిక సౌందర్యాన్ని ఇప్పుడు ప్రేమించలేను. పాడు కళ్లు! ఇప్పుడు వీటిని తీసేసినా, ఆమె బాహ్యరూపం నా మనస్సులో నుంచి పోదు కదా!

కళ్లు వచ్చాక, నిజమైన అమె ఆత్మ సౌందర్యాన్ని చూడలేని అంధుడనయి, చేతులారా నా స్వర్గాన్ని నరకం చేసుకున్నాను.

దేవుడా! ఎంత పని జరిగింది!

(ఫిబ్రవరి 78 - 'తెలుగు అమెరికా'లో ప్రచురింపబడిన కథ.)

## ఆరని మంటలు . . . యన్నంరెడ్డి వెంకటరెడ్డి

మండుతున్నాయ్ మంటలు
పొగలు - సెగలుగా!
రేగుతున్నాయ్ జ్వాలలు
నిప్పు కణికలుగా!

కసిగా కాల్చాలని పేదవారి కొంపల్ని
మసిగా మార్చాలని ఉన్నవారి ఆస్తుల్ని
అగ్ని జ్వాలలు ఆకాశానికి
కూలిన కప్పులు భూతలానికి
మట్టిపాలు చెయ్యాలని
పొట్ట చేతికియ్యాలని
ఆరాట పడుతోన్నాయ్ -
ఆకలి మంటలతో
పోటీలు పడుతోన్నాయ్!

## నిజం . . . జయధీర్ తిరుమలరావ్

పచ్చని ఈ పంట
కర్షకుల కలల పంట
పండింది ఇది
కూలీల చెమట పారగా కాల్వల వెంట

ఐనా...
తమ కడుపు ఇంట
మండుతునే ఉంది ఆకలి మంట
దీనికి కారణం వాళ్ళకు తెలిస్తే
తప్పదు!
కూర్చొని తిన నేర్చిన వాళ్ళకు తంటః